

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

ఫార్మా పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ డిమాండ్ చేశారు. 8లో



జాగిలాలతో తనిఖీలు

పార్సిల్ సర్వీస్‌ల ద్వారా జరిగే గంజాయి రవాణాను అరికట్టేందుకు జాగిలాలతో తనిఖీలు విస్తృతం చేశారు. 8లో



35 మంది అర్హుల గుర్తింపు

అనకాపల్లిలో బుధవారం నిర్వహించిన సదరం క్యాంపులో 35 మందిని అర్హులుగా గుర్తించారు. 8లో

1 రెండోసారీ మోసం



నేను ఎంసీఏ పూర్తిచేశాను. ఉద్యోగం ఏమీ రాలేదు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరిట నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తోంది. దానిపై మాట్లాడట్లేదు. అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. ఇచ్చే పరిస్థితి లేదంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఎన్నికలకు ముందు ఆ మాత్రం తెలియదా? 2014లో కూడా ఇదే విధంగా మోసపోయాం. మళ్లీ ఇది రెండోసారి.

– శ్రీరామమూర్తి, నిరుద్యోగి, గునిపూడి

2 ఉచిత బస్సు తుస్సేనా?



కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లో అక్కడి కొత్త ప్రభుత్వాలు అధికారం చేపట్టిన నెలరోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేశాయి. ఆ రెండు రాష్ట్రాల ఎన్నికల మేనిఫెస్టో నుంచి కాపీ కొట్టిన చంద్రబాబు అధికారంలోకి వస్తే వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని ఊదరగొట్టారు. వచ్చి వందరోజులు కావస్తోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాం. ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలి. ఎన్నికలకు ముందు ఒకలా.. ఎన్నికల తర్వాత మరోలా మాట మార్చడం సరికాదు.

–అవుగడ్డి రాజ్‌కుమారి, ఆక్సాహేబుపేట, కోటవురట్ల

3 నెలకు రూ.1500 ఏదీ?



ఇంట్లో 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసున్న ఆడోళ్లందరికీ నెలకు రూ.1500లు ఇస్తామని సెంద్రబాబు ఎన్నికలపుడు టీవీల్లోనూ, మీటింగుల్లోనూ పదేపదే సెప్పాడు. గేమాల్లో మాలాటి ఆడోళ్లం సెంద్రబాబు మాటల్ని నమ్మి ఓట్లేసినాం. సెంద్రబాబు ఏలుబడి వచ్చి అప్పుడే వందరోజులవుతోంది. ఇంకా ఆ పథకంపై ఎవలూ ఏటీ సెప్పట్లేదు. నాయకుల్ని అడుదామంటే.. ఎలచ్చన్ల తర్వాత కనిపిస్తేనే కదా..! వలంటీర్లను అడుగుదామంటే.. ఆల్లూ ఇప్పుడు నేరు. ఎప్పట్నుంచి ఆ పథకం ఇస్తారో సెప్పాలి. ఆశపెట్టి, మోసం సేయడం పద్దతికాదు.

– నారపురెడ్డికుమారి, జీజే పురం, నక్కపల్లి

4 అన్నదాత 'కష్టే'భవ!



జగన్ ప్రభుత్వంలో ఏటా జూన్ మాసంలో రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యేవి. చంద్రబాబు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. సాగుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. బ్యాంకు రుణాలకు వడ్డీ కట్టాల్సి వచ్చింది. నా నాలుగెకరాల భూమికి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఎకరాకి రూ.525 పంటల బీమా ప్రీమియం కట్టేవాళ్లం. జగన్ హయాంలో ప్రభుత్వమే చెల్లించింది.

– బంటు పరదేశినాయుడు, రైతు, కొండపాలెం గ్రామం

5 వందనం కాదు.. వంచన



నాకు ఇద్దరు కుమార్తెలు. ప్రైవేట్ కాలేజీలో పెద్ద కుమార్తె ఇంటర్ సెకండియర్, చిన్న కూతురు ఫస్టియర్ చదువుతున్నారు. ఎన్నికల ముందు ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. మాకు రూ.30 వేలు వస్తుందని ఆశపడ్డా. ఆ మొత్తంతో పిల్లల ఫీజు భారం కొంతైనా తగ్గుతుందనుకున్నా. ఈ ఏడాది పైసా కూడా ఇవ్వరని అంటున్నారు. అదే నిజమైతే మమ్మల్ని మోసం చేసినట్టే.

– కర్రి లక్ష్మి, గృహిణి, అనకాపల్లి

6 అంతా 'గ్యాసే'నా!



ప్రతీ ఇంటికి కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు పదేపదే ప్రచారం చేశారు. తమకు అధికారం ఇస్తే సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు సిలిండర్లు అందిస్తామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు దానిపై మాట్లాడట్లేదు. మాలాంటి పేద, దిగువ మధ్యతరగతి మహిళలంతా గ్యాస్ సిలిండర్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

– శీరా రమణమ్మ, గృహిణి, గొల్లలపాలెం

సూపర్ సిక్స్.. వంచన ఫిక్స్

బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ | **వందరోజులైనా ఒక్క పథకమూ అమలు కాలేదు** | **'ఆరు' నూరైనా అమలు చేయాలంటున్న జనం**



అనుకున్నంతా అయ్యింది.. భయపడినట్టే జరిగింది.. జీవిత కాలంలో ఎన్నడూ మాట మీద నిలబడిన చరిత్ర లేని చంద్రబాబును నమ్మి జనం మరోసారి మోసపోయారు. అధికారం చేపట్టి వంద రోజులు కావస్తున్నా సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క పథకాన్ని అమలు చేయ లేదు. సంపదను సృష్టిస్తా.. సంక్షేమాన్ని అందిస్తా అని ఎన్నికల ముందు చెప్పిన మనిషి.. నిండు శాసనసభలో సూపర్ సిక్స్ అమలును తలచుకుంటే భయమేస్తోందని చెప్పారు. తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. విశ్వసనీయత అనేది వాతలు పెట్టుకుంటే రాదు. ప్రజలంటే ప్రేమ ఉండాలి.. వారికి మంచి చేయాలన్న తపన ఉండాలి.. చెప్పిన మాట మీద నిలబడాలి.. మనసా వాచా చిత్తశుద్ధితో వాగ్దానాలను అమలు చేయాలి.. మాట ఇచ్చే ముందే ఆలోచించుకోవాలి. అదీ నిజమైన ప్రజా నాయకుడి లక్షణం. అది ఏ కోశానా లేని వ్యక్తిని ఎందుకు అందలం ఎక్కించామా అని జనం అనుకునే పరిస్థితి వచ్చిందంటే ఆ ప్రజా ప్రతినిధి సిగ్గుతో తల దించుకోవలసిందే.

సాక్షి, అనకాపల్లి: చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి వంద రోజులు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల ఊసెత్తకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్‌లోని పథకాలకు అర్హులు వేల సంఖ్యలో ఉన్నారు. 2014లోనూ అనేక హామీలు ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేకపోవడంతో చంద్రబాబును 2019లో ప్రజలు ఓడించారు. మళ్లీ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం వంటి హామీ లతో చంద్రబాబు 2024 ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి నేతలు కూడా సూపర్ సిక్స్‌ను హోరెత్తించారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించాక సూపర్ సిక్స్‌లోని ఏ పథకాన్నీ ప్రారంభించకపోవడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

అన్నదాత మండిపాటు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా కింద జిల్లాలోని సుమారు 2,65,778మంది రైతులు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం పొందేవారు. బాబు అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు రైతులకు పంపిణీ చేస్తానని చెప్పినప్పటికీ ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆ ఊసెత్తకపోవడంతో అన్నదాతలంతా చంద్రబాబుపై మండిపడుతున్నారు. వారంతా అప్పులు చేసి, వ్యవసాయం చేసుకోవాల్సిన పరిస్థితితో ఉసూరుమంటున్నారు.

అందేనా.. తల్లికి వందనం

బడికి వెళ్లే పిల్లలందరికి తల్లికి వందనం కింద రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయమన్న చంద్రబాబు, ఇటీవల మంత్రి లోకేశ్‌తో ఈ ఏడాది తల్లికి వందనం ఇవ్వలేమంటూ ప్రకటించారు. తల్లులంతా ప్రభుత్వంపై మండిపడుతున్నారు. జిల్లాలో సుమారు 1,50,870 మంది తల్లులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రూ.15 వేల చొప్పున జమ చేసేది. ఇప్పుడు ఈ సాయం కోసం 2,13,190మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగులకు ఆశాభంగమేనా?

2014లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసి, ఈ ఎన్నికలలోను అదే హామీని ప్రధానంగా తీసుకొచ్చారు. ఈ పథకం పొందేందుకు జిల్లాలోని 4,79,920 బీపీఎల్ కుటుంబాల్లో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

హామీ ఉత్త'గ్యాసే'నా..

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం 4,79,920 కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. 14,39,760 సిలిండర్లు సరఫరా చేయాల్సి ఉంది.


మహిళలకు ఏం సమాధానం చెబుతారు?

గత ప్రభుత్వంలో మహిళలకు చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పేరిట సాయం అందేది. ఏ విధమైన పింఛన్ రాని 18 ఏళ్లు దాటిన మహిళలదరికీ నెలకు రూ.1500 చొప్పున అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లాలో అరులు 5,47,888మంది ఉన్నారు.

ఉచిత బస్సు వట్టిదేనా..

జిల్లాలో 18 ఏళ్లు దాటిన మహిళలు 6,53,505మంది.. 5 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు 84,814మంది. వీరందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి. ఇంత వరకు దాని గురించి ప్రస్తావన లేదు.

అన్నదాత సుఖీభవ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకంలో నాలుగు విడతల్లో జిల్లాలోని రైతులకు రూ.**1301.12** కోట్ల లబ్ధి చేకూరింది. గత ఏడాది లబ్ధి పొందిన రైతుల సంఖ్య (2,65,778) ఆధారంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ (ఒక్కో రైతుకు రూ.20 వేలు) మేరకు ఈ ఏడాది రూ.**531.55** కోట్ల సాయం అందించాలి.

తల్లికి వందనం



వైఎస్ జగన్ పాలనలో అమ్మఒడి పేరిట ఏడాదికి సుమారు రూ.230 కోట్ల చొప్పున వరుసగా నాలుగేళ్లు తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.**917** కోట్ల ఆర్థిక సాయం జమ చేశారు. కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పేరిట జిల్లాలో ఉన్న 2,13,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలి. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.**319.79** కోట్లు ఈ ఏడాది అందించాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఈ ఏడాది 'తల్లికి వందనం' చెల్లింపులు ఉండవని అసెంబ్లీ సాక్షిగా విద్యాశాఖా మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు




జిల్లాలో మొత్తం కుటుంబాలు **4,79,920**

ఇవ్వాల్సిన సిలిండర్లు **14,39,760**

అయ్యే వ్యయం (ప్రస్తుత ధర రూ.811) రూ.**116.76** కోట్లు

మహిళలకు ప్రతి నెల రూ.1500



జిల్లాలో ఏ విధమైన పింఛన్ రాని 18 ఏళ్లు దాటిన మహిళలదరికీ నెలకు రూ.**1500** చొప్పన అందిస్తామని హామీ ఇచ్చారు.

జిల్లాలో 18 ఏళ్లు దాటిన అర్హులైన మహిళలు **5,47,888**

ప్రతి నెలా ఇవ్వాల్సిన లబ్ధి రూ.**82.18** కోట్లు

ఏటా వెచ్చించాల్సిన నిధులు రూ.**986.20** కోట్లు

యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు




జిల్లాలో మొత్తం కుటుంబాలు **4,79,920**

అధికారుల లెక్కల మేరకు నిరుద్యోగులు **2,30,000**

ప్రతి నెలా చెల్లించాల్సిన భృతి రూ.**69** కోట్లు

ఏటా వెచ్చించాల్సిన నిధులు రూ.**828** కోట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



జిల్లాలో 18 ఏళ్లు దాటిన మొత్తం జనాభా **14,94,947**

18 ఏళ్లు దాటిన మహిళలు **6,53,505**

5 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు **84,814**

జగన్ పాలనలో ఈపాటికే 'భరోసా'



నాకు ఎకరం పొలం ఉంది. జగన్ సీఎంగా ఉంటే ఈపాటికే రైతు భరోసా జమయ్యేది. ఐదేళ్లలో రైతు భరోసారూ.67,500అందుకున్నాను.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామన్నారు. ప్రభుత్వంవచ్చి వందరోజులు కావస్తున్నా పెట్టుబడి సాయం అందలేదు. అసలు ఇస్తారోలేదో కూడా తెలియట్లేదు. **– శనివాడ కొండబాబు, రైతు, పులపర్తి, యలమంచిలి**

జగనన్న హయాంలో 4 ఏళ్లు లబ్ధి



నాకు ఇద్దరు పిల్లలు. యలమంచిలి కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో చదువుతున్నారు. మాది సామన్య కుటుంబం. గత ప్రభుత్వంలో వరుసగా నాలుగేళ్లు క్రమం తప్పకుండా అమ్మఒడి వచ్చింది. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం ద్వారా ఇస్తామన్నారు. హామీ నిలబెట్టుకోవాలి. ఈ ఏడాది నుంచే తల్లికి వందనం అమలు చేయాలి.**– కొర్లెడ్ల ఉమ, ఎర్రవరం, యలమంచిలి మున్సిపాలిటీ**

నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం



వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం ఇంటింటి తలుపు తట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి హామీలు అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా.. ఇలా ఒకటా రెండా.. ఇచ్చిన ప్రతి హామీ అమలైంది. ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

జగనన్న అమ్మఒడి

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లు)
2019-20	1,53,549	230.32
2020-21	1,54,101	231.10
2021-22	1,52,901	229.30
2022-23	1,50,870	226.30

వైఎస్సార్ రైతు భరోసా

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి(రూ.కోట్లు)
2020-21	2,32,482	313.85
2021-22	2,51,572	339.62
2022-23	2,50,888	343.22
2023-24	2,65,778	304.43

వైఎస్సార్ కాపునేస్తం

ఫేజ్	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లు)
ఫేజ్-1	17,274	25.91
ఫేజ్-2	14,973	22.46
ఫేజ్-3	16,762	25.14
ఫేజ్-4	18,122	27.18

ఈబీసీ నేస్తం

ఫేజ్	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లు)
ఫేజ్-1	3077	4.65
ఫేజ్-2	4864	7.29
ఫేజ్-3	3664	5.49

మూడు విడతల్లో రూ.17.40 కోట్ల లబ్ధి చేకూరింది

వైఎస్సార్ చేయూత

40-60 ఏళ్ల మధ్య వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పన నాలుగేళ్లలో రూ.75 వేలు లబ్ధి చేకూర్చారు. ఈ పథకం కింద జిల్లాలో 1,15,101 మంది మహిళలకు రూ.795.75 కోట్ల ఆర్థిక సాయం అందింది.

జగన్ హయాంలో ఉద్యోగ, ఉపాధికల్పన

- జిల్లాలోని సచివాలయాల్లో 6 వేల శాశ్వత ఉద్యోగాలు, 10 వేల వలంటీర్లు
- వైద్య, ఆరోగ్యశాఖలో వైద్యులు, పారామెడికల్, ఇతర పోస్టులు 10 వేలు
- పరిశ్రమల్లో ఐదేళ్లలో జిల్లాలోని 22,178 మందికి ఉద్యోగ కల్పన. (ఎంఎస్‌ఎంఈలలో 8064 మంది, భారీ పరిశ్రమల్లో 14,114 మంది)
- జిల్లాలోని నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదునిచ్చి 1,360 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు.

అలవికాని హామీలు.. ఇవిగో సాక్ష్యాలు



క్లుప్తంగా

సదరం క్యాంప్‌లో 35 మంది అర్హుల గుర్తింపు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఎన్టీఆర్ వైద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం నర్సీపట్నం, పాయకరావుపేట మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించినట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించేందుకు 35 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. గురువారం కోటవురట్ల, నక్కపల్లి మండలాల దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయితో ఎస్ఐ సతీష్

చీడికాడ: మండలంలో అప్పలరాజుపురం చెరకు కాటా వద్ద స్థానిక ఎస్ఐ బి.సతీష్ మంగళవారం 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పి.వీర, చిన్నస్వామి ఓ కారులో కోనాం నుంచి అప్పలరాజుపురం మీదుగా గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు ప్రసాద్ (ఫైల్)

నాతవరం: మండలంలో ఎం.బెన్నవరం గ్రామానికి చెందిన మొండెం ప్రసాద్ (24) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ప్రసాద్ గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుంటాడు. బుధవారం రాత్రి గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదశావత్తు షాక్ గురయ్యాడు.తీవ్ర గాయాలు కావడంతో నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రసాద్‌కు భార్య, ఆరు నెలలు బాబు ఉన్నారు. నాతవరం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రసాద్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు–2024 ఫలితాలు విడుదలైనట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లో నిరుద్యోగ యువతులకు శిక్షణ ఇచ్చి, నిర్వహించిన పరీక్ష ఫలితాలను ప్రభుత్వ పరీక్షలు విభాగం విజయవాడ బుధవారం విడుదల చేసినట్టు ఆమె తెలిపారు. ఫలితాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆమె పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్

- అనకాపల్లి విద్యాశాఖలో అవినీతి చేప
- యలమంచిలిలో ఓపెన్ స్కూల్ సెంటర్ అనుమతికి లంచం డిమాండ్
- రూ.30 వేలు తీసుకుంటూ పట్టుబడిన కోఆర్డినేటర్ కుమార్
- ఈ నెలలోనే ముగ్గురు నుంచి వసూలు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ కుమార్

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి విద్యాశాఖలో ఓ అవినీతి చేప ఏసీబీ అధికారుల వలకు చిక్కింది. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న యలమంచిలికి చెందిన వారి నుంచి జిల్లా కోఆర్డినేటర్ కుమార్ రూ.35 వేలు డిమాండ్ చేశారు. ఫైనల్‌గా రూ.30 వేలు ఇస్తే చేస్తా.. లేదంటే మీ దరఖాస్తు చెత్త బుట్టకే పరిమితమవుతుందని చెప్పారు. దీంతో దరఖాస్తుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా కుమార్ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికారు. ఏసీబీ డీఎస్పీలు నాగేశ్వరరావు, రమ్య ఆధ్వర్యంలో సీఐ కిరణ్ కుమార్, శ్రీనివాసరావులతో కూడిన బృందం కేసు నమోదు చేసి, విచారణ చేపట్టింది. కుమార్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూనే ఏడాది క్రితం డిప్యూటేషన్‌పై జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు.

మరో 2 సెంటర్లకు రూ.60 వేలు

యలమంచిలి స్టడీ సెంటర్‌తో పాటు అచ్యుతాపురంలో మరో ఇద్దరి నుంచి కుమార్ రూ.60 వేలు వసూలు చేశారు. అచ్యుతాపురంలో రెండు స్టడీ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేయగా, ఒక్కో సెంటర్‌కు రూ.30 వేల చొప్పున మొత్తం రూ.60 వేలు వసూలు చేశారు. అంతేకాకుండా జిల్లాలో ఉన్న 32 పాత ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ల నుంచి లాగిన్ వివరాలంటూ ఒక్కో సెంటర్ నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్టు సమాచారం. కావాలనే ఏటా పాత సెంటర్లకు లాగిన్ వివరాలు రీసెట్ కొట్టడంతో మళ్లీ కొత్తగా లాగిన్ వివరాలు ఇవ్వాల్సి వస్తోంది. లాగిన్ పేరిట తమ నుంచి రూ.5 వేల చొప్పున ఏటా రూ.1,60,000 వసూలు చేస్తున్నట్టు బాధితులు చెబుతున్నారు.

'బ్రాండిక్స్' బస్సుకు ప్రమాదం

- స్టీరింగ్ ఊడిపోయి పొలాల్లోకి దూసుకుపోయిన వాహనం
- 19 మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలు



బవులవాడ రహదారి వద్ద ప్రమాదానికి గురైన బస్సు



అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అనకాపల్లి: బ్రాండిక్స్ కంపెనీకి ఉద్యోగులను తరలించే ఓ బస్సు మండలంలో బవులవాడ గ్రామం వద్ద ప్రమాదానికి గురైంది. బస్సు స్టీరింగ్ ఊడి పోయి అదుపు తప్పడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయి కాలువ గట్టును ఢీ కొంది. స్థానికులు, బస్సులో ప్రయాణించిన ఉద్యోగుల కథనం మేరకు వివరాలు... బ్రాండిక్స్‌కు చెందిన నాలుగో యూనిట్ ఉద్యోగులను ఎక్కించుకుని మండల కేంద్రం చీడికాడ నుంచి బుధవారం ఉదయం 11.30 గంటలకు బస్సు బయలుదేరింది. చీడికాడ, తురువోలు, చోడవరం, వెంకన్నపాలెం, ముద్దుర్తి గ్రామాల్లో మొత్తం 55మంది ఉద్యోగులు బస్సులో ఎక్కారు. బస్సు కంపెనీకి వెళుతున్న సమయంలో అనకాపల్లి మండలం బవులవాడ రహదారి వద్ద స్టీరింగ్ ఒక్కసారిగా ఊడిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి పక్కనే ఉన్న పొలాల్లో చిన్నకాలువ బ్రిడ్జికు బస్సు ఢీకొట్టడంతో ఆగిపోయింది. ఈ ప్రమాదంలో 19మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలయ్యాయి.వారిని హుటాహుటిన అనకాపల్లి మూడు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందజేశారు. చికిత్స అనంతరం పలువురు ఉద్యోగులు ఇళ్లకు వెళ్లిపోగా, ముగ్గురు క్షతగాత్రులు ఆస్పత్రిలోనే ఉండి చికిత్స పొందుతున్నారు.

కేసు నమోదు

క్షతగాత్రులు ముద్దుర్తి గ్రామానికి చెందిన కోరాడ చిన్నారి, ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవ రమ ఫిర్యాదు మేరకు బస్సు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఏఎస్ఐ భాస్కరరావు చెప్పారు.

యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాదరాజు



బాధ్యతలు చేపట్టిన ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా బి.జె.ఎస్. ప్రసాదరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏవోగా, ఏలూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసాదరాజును గత నెల 29న సాధారణ బదిలీల్లో భాగంగా యలమంచిలి కమిషనర్‌గా పురపాలకశాఖ ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వరదలు ముంచెత్తడంతో ఆయన ఏలూరులో విధుల నుంచి రిలీవ్ కావడానికి సమయం పట్టింది. బుధవారం ఇక్కడ కమిషనర్ చాంబర్‌లో ఆయన విధుల్లో చేరారు.గత ఏప్రిల్‌లో కమిషనర్ కొండలరావు పదవీ విరమణ చేశారు.అప్పటి నుంచి ఇంచార్జి కమిషనర్లే విధులు నిర్వర్తించారు.రెగ్యులర్ కమిషనర్‌గా విధుల్లో చేరిన ప్రసాదరాజుకు మున్సిపాలిటీలో పలు విభాగాల అధికారులు,సచివాలయాల సిబ్బంది,పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు పట్టణంలో ప్రధాన సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అందరూ సహకరించాలని ఆయన అధికారులను కోరారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): కిరండూల్, బచేలి ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు దంతేవాడ వరకు మాత్రమే నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు, కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు, విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు, కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కిరండూల్–దంతేవాడ మధ్య రాకపోకలు సాగించవని పేర్కొన్నారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కలెక్టర్‌తో కలిసి ఆస్పత్రిని పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ సీహెచ్. అయ్యన్నపాత్రుడు తెలిపారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా ఆస్పత్రిలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవిని ప్రశ్నించారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ఆస్పత్రికి కొత్త అంబులెన్స్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. స్నేక్ బైట్ కేసును ప్రైవేట్ ఆస్పత్రికి ఎందుకు పంపించారో తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ శంకర్ ప్రసాద్, ఆర్డీవో జయరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పీకర్, కలెక్టర్ ఆస్పత్రిలో అన్ని విభాగాలను పరిశీలించారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో కలిసి స్పీకర్ సీహెచ్. అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. కలెక్టర్‌తో కలిసి స్పీకర్ అన్నా క్యాంటీన్‌లో భోజనం చేశారు.

సరియా జలపాతాన్ని మూసివేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్



దేవరాపల్లి: పర్యాటకుల ప్రాణాలను హరిస్తూ మృత్యు కుహరంగా మారిన సరియా జలపాతాన్ని సందర్శించేందుకు టూరిస్టులకు అనుమతించరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల పరిధిలోని ప్రమాదకర సరియా జలపాతాన్ని తక్షణమే మూసి వేయాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నో జలపాతాలు ఉన్నప్పటికీ రహదారి మార్గం, కనీస సౌకర్యాలు లేని సరియా జలపాతానికి నిత్యం వందలాది మంది సందర్శకులు వెళుతున్నారని చెప్పారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న జలపాతం సమీపంలో జన సంచారం లేక పోవడంతో పాటు పోలీసులు పర్యవేక్షణ లేని కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఈ జలపాతంలో పడి ఇప్పటి వరకు 40 మందికి పైగా యువకులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తీవ్రంగా పరిగణించకుంటే మరి కొంత మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పరిశుభ్రత.. అందరి బాధ్యత

కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, అందకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లాను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వచ్ఛతా హీ సేవ – 2024లో భాగంగా రెండవ రోజు జిల్లాలోని 24 మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయడంతోపాటు, గ్రామాల్లో ప్రజలతో మానవహారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట: పామాయిల్ తోటలో చెట్ల కొమ్మలు కోస్తున్న ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఎం.కె.పట్నం పంచాయతీ శివారు పెదపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదపేట గ్రామానికి చెందిన కొదమ అచ్చయ్య తన ఆయిల్‌పామ్ తోటలో కొమ్మలు కోసేందుకు గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామానికి చెందిన కూలీ ఊట వెంకటరమణ(48)తో పాటు మరో ఇద్దరి పెట్టుకున్నాడు. బుధవారం తోటలో కొమ్మలు కోస్తున్న వెంకటరమణ కత్తికి 11 కేవీ విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే సహచర కూలీలు ఆయనను 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. స్థానికుల సమాచారంతో విద్యుత్‌శాఖ మండల ఏఈ పద్మనాభం విద్యుత్ సరఫరా నిలిపివేసి, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు ఐరన్ గొట్టానికి ఉన్న కత్తిని వినియోగించడంతో ఈ ప్రమాదం జరిగిందని ఏఈ తెలిపారు. తోటల్లో పనులు చేపట్టే ముందు సమాచారం ఇస్తే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ప్రశాంతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



వినాయకునికి పూజలు చేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: జిల్లాలో ప్రశాంత వాతావరణలో వినాయక నవరాత్రుల వేడుకలు జరుగుతున్నాయని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముందుగా స్వామి వారికి ఎస్పీ ప్రత్యేక పూజలుచేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్‌రావు, సూపరింటెండెంట్‌లు కుమారి, నిర్మల, వరలక్ష్మి, కమ్యూనికేషన్ సీఐ వెంకట చిట్టి, పోలీస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి



పదో తరగతి విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అచ్యుతాపురం(మునగపాక): పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. అచ్యుతాపురం మండలం పూడిమడక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇంగ్లిషు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను మెరుగుపరుచుకోవాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్ణయించిన అంశాలపై అర్థవంతమైన చర్చ జరపాలని సూచించారు. అనంతరం పదవతరగతి విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు.హెచ్ఎం పి.వి. రామశేషు, రీసోర్స్ పర్సన్లు ఎస్.ఎస్.వి. నాగేశ్వరరావు,గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గాయత్రీ దేవికి మధుర కవనధుని బిరుదు ప్రదానం



గాయత్రీదేవిని సన్మానించి, పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

నక్కపల్లి: ప్రముఖ కవయిత్రి, ఉపమాక వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల వ్యాఖ్యాత, విశ్రాంత తెలుగు పండిట్ డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవికి హైదరాబాద్‌కు చెందిన అనంతచ్ఛందం సాహిత్య సంస్థ వారు మధుర కవనధుని అనే బిరుదును ప్రధానం చేసింది. ఈ నెల 17న హైదరబాద్‌లో బైరామల్ గూడ అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గాయత్రీదేవి రచించిన శతక గాయత్రీ అనే గ్రంథాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి 200మంది శతక కవులు, కవయిత్రులు పాల్గొన్నారు. ప్రముఖ కవులు కంది శంకరయ్య, చింతారామకృష్ణలతోపాటు, సంస్కృతావధాని, శతావధాని ముత్యంపేట గౌరీ శంకర శర్మ బంధకవి శ్రేష్ఠులు వైద్యం వెంకటేశ్వరాచార్యులు, ప్రముఖ శతావధాని చక్రాల లక్ష్మీకాంతరాజారావు, విశిష్ట అతిథులుగా పాల్గొని శతక గాయత్రీరచయిత గాయత్రీదేవిని మధుర కవనధుని బిరుదుతో ఘనంగా సత్కరించారు. సాహిత్య రంగంలో గాయత్రీదేవి సేవలను కొనియాడారు. రెండురోజుల పాటు జరిగిన ఈ సభలను అనంతచ్ఛందం సమూహం గురువర్యులు తోపెల్ల బాల సుబ్రహ్మణ్యం సమర్థవంతంగా నిర్వహించినట్టు గాయత్రీదేవి తెలిపారు. రెండుతెలుగు రాష్ట్రాలతోపాటు కెనడా, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలనుంచి పలువురు శిష్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈసందర్భంగా గాయత్రీదేవి మాట్లాడుతూ తనకు గర్భబంధ,చిత్ర కవిత్వాలను పరిచయం చేసిన గురువులు తోపెల్లవారికి రుణపడి ఉంటానన్నారు.

'ధన'నాథుడు



నోట్ల దండలతో గణనాథుడు

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి వీధిలోని వినాయక విగ్రహాన్ని రూ.10, రూ.20, రూ.500 తదితర కరెన్సీ నోట్ల దండలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆళ్ల వారి వీధి, కస్పావీధి, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను ఘనంగా జరిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు



విజయం సాధించిన విద్యార్థులతో శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై సత్తా చాటారు. ఈ నెల 14 నుంచి 17 వరకు సీబీఎస్ఈ బోర్డు, ఎస్ఆర్ విద్యా నికేతన్ గద్వాల్‌లో నిర్వహించిన క్లస్టర్–7 కబడ్డీ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు అండర్– 14, 19 (ఎం.గణేష్, శివ, సాయి, రామ్ బృందం) బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరంతా అక్టోబర్ 17 నుంచి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లోని సరస్వతీ పబ్లిక్ స్కూల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు, కోచ్ లక్ష్మణ్, తదితరులు అభినందించారు.

జాగిలాలతో విస్తృత తనిఖీలు



పార్సిల్ సర్వీసు కార్యాలయంలో జాగిలంతో తనిఖీ చేస్తున్న సీఐ రేవతమ్మ, సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు జాగిలాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. బుధవారం అనకాపల్లి, నర్సీపట్నం, తదితర ప్రదేశాలలో ఏపీఎస్ ఆర్టీసీ, ప్రైవేట్ పార్సిల్ సర్వీసు కేంద్రాల్లో తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, చెక్ పోస్టులలో కూడా వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో పట్టుబడితే 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. గంజాయి సేవించినా, అక్రమంగా రవాణా చేసినట్టు తెలిస్తే డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ...

నర్సీపట్నం: ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ పర్యవేక్షణలోస్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు జరిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు నవత పార్సిల్ సర్వీస్, క్రాంతి ఇతర పార్సిల్ గొడౌన్‌లలో తనిఖీలు జరిపినట్టు సీఐ తెలిపారు.


20 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: మండల కేంద్రం కశింకోట శివారులో 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. మద్యం సీసాలను తరలిస్తుండగా హేమంత్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా ఉమామహేశ్వరి

సాక్షి, అనకాపల్లి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా ఉమా మహేశ్వరిని నియమించారు. ఆమె ప్రస్తుతం కర్నూల్ జిల్లా రిజిస్ట్రార్(ఎంవీ అండ్ ఏ)గా పనిచేస్తున్నారు. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జానకీ దేవిని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం ఏపీ స్పెషల్ ఛీఫ్ సెక్రెటరీ ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

రంగస్థల నటుడు,దర్శకుడు రామప్పారావు మృతి



శరగడం రామప్పారావు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెంకు చెందిన రంగస్థల నటుడు శరగడం రామప్పారావు(74) బుధవారం మృతిచెందారు.హరిపాలెంలోని సన్యాసాంబ థియేటర్ యజమాని, రంగస్థల నటుడు,దర్శకుడు రామప్పారావు పలు సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహించారు. ఖాదీబోర్డు ద్వారా పలువురికి రుణాలు మంజూరు చేయించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 1968 నుంచి కాంగ్రెస్ పార్టీలో నాయకునిగా సేవలందించారు.

ఫార్మా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ
- రెండో రోజూ కొనసాగిన సీపీఎం రక్షణ యాత్ర

రాంబిల్లి(యలమంచిలి): ప్రమాదకర విషవాయువులు విడుదల చేస్తున్న ఫార్మా పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ డిమాండ్ చేశారు. రాంబిల్లి మండలంలో గోవిందపాలెం, నేవీ గేట్, వాడనర్సాపురం, కొత్తపట్నం వెంకయ్యపాలెం, గజరెడ్డిపాలెం లోవపాలెం, లాలం కోడూరు గ్రామంలో ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల భద్రత కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణ యాత్ర రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాంబిల్లి మండలంలో నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.లోకనాథం, ప్రభావతి, జి.దేముడునాయుడు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, ఎం.అప్పలరాజు, పి.మాణిక్యం, నారాయణరావు, రాము నూకన్న రమణ, కాసియా, అప్పలరాజు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ

తుమ్మపాల: సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్. ఎస్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. పదవ తరగతి పాసై, 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారికి రెండు నెలల పాటు మాకవరపాలెం నాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ తరగతులు జరుగుతాయని, స్టేషనరీ ఉచితంగా అందిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 77803 74625 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సాగుకు పెట్టుబడి ఎప్పుడిస్తారు ?



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభం కావడంతో పంటల సాగు చేసుకోవాలి. జగన్ సీఎంగా ఉంటే ఈపాటికి రైతు భరోసా వచ్చేది. కూటమి నేతలు అన్నదాతా సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదు. ఎకరాకు సుమారు రూ. 40 వేల నుంచి 50 వేలు ఖర్చవుతుంది. దీంతో చాలా మంది రైతులు అప్పులు చేయవలసి వస్తోంది.

– సిరసపల్లి వెంకటరావు, రైతు, ఊడేరు, అనకాపల్లి మండలం

భృతి... భ్రాంతియేనా ?



ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కావస్తున్నా పట్టించుకోవడం లేదు. నాలాంటి నిరుద్యోగులు ఎందరో భృతి కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం నెలనెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేకపోతే ఉద్యోగావకాశాలు కల్పించాలి.

– పోలిశెట్టి రవి, కొత్తూరుగ్రామం, అనకాపల్లి మండలం

ఆయనే సీఎంగా ఉంటే రైతు భరోసా అందేది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈపాటికి రైతు భరోసా అందేది. పంటలకు పెట్టుబడి పెట్టుకోవడానికి అవకాశం కలిగేది. గత ఐదేళ్లలో రైతు భరోసాగా రూ.67,500 అందుకున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాతా సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు అతీగతీ లేదు. పంటలు పండించడానికి ఇదే అదును. పెట్టుబడి కోసం అప్పు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా రైతు సహాయం అందివ్వాలి.

– తంటపురెడ్డి అప్పారావు, రైతు, ఎ.ఎస్. పేట, కశింకోట మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించిన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అయితే అధికారంలోకి వచ్చి ఇన్నిరోజులైనా పట్టించుకోలేదు. కచ్చితంగా నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి. లేదా ఉద్యోగ అవకాశాలు కల్పించి కుటుంబాలను ఆదుకోవాలి.

-కందుల మణికంఠ, నరసింగబిల్లి, కశింకోట మండలం.

అప్పుడు హోరెత్తించి.. ఇప్పుడు ఊరుకున్నారు



మహిళలకు నెలకు రూ.1,500 అందిస్తామని ఎన్నికల ప్రచారంలో హోరెత్తించారు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. హామీలిచ్చి విస్మరించడం సబబు కాదు. వెంటనే మహిళలందరికీ రూ.1,500 సాయం అందించాలి.


కె.లక్ష్మి, కశింకోట

ఈ ఏడాది నుంచే ఇవ్వాలి



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మా ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. గతంలో ఒకరికి అమ్మ ఒడి వచ్చింది. కూటమి అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరిట చదివే పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ఇప్పుడు డేటా సేకరించాలన్న నెపంతో వచ్చే ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నారు. హామీ ఇచ్చిన మేరకు సహాయాన్ని ఈ ఏడాది నుంచే అందించాలి.

-పసుపునాటి కాసులమ్మ, జెట్టపురెడ్డితుని, కశింకోట మండలం




బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

‘అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ... వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయంగా అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తాం... నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తాం.. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 చొప్పున అకౌంట్లో జమ చేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. రైతాంగం వ్యవసాయ పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకానికీ ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని నియోజకవర్గ ప్రజల డిమాండ్

ప్రతి మహిళలకు నెలకు రూ.1500 (సూపర్ 6)



మొత్తం అర్హులు : **63,874**
నెలకు ఇవ్వాల్సిన సాయం : రూ. **95.81** కోట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (సూపర్ 6)



మొత్తం అర్హులు : **89,289**


జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

మొత్తం లబ్ధిదారులు : **25,012**
అందిన సాయం : **రూ.33,76,62,000**

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

మొత్తం లబ్ధిదారులు : **30,168**
అందిన సాయం : **రూ.45.25 కోట్లు**

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం (సూపర్ 6)



ప్రతి బిడ్డకు రూ.15 వేలు తల్లికి వందనం (సూపర్ 6)



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

మొత్తం లబ్ధిదారులు : **25,012**
అందాల్సిన సాయం : **రూ.50,02,40,000**

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి అందాల్సిన సాయం

మొత్తం లబ్ధిదారులు : **43,536**
ఇవ్వాల్సిన మొత్తం : **రూ.65.30 కోట్లు**

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు (సూపర్ 6)



మొత్తం లబ్ధిదారులు : **70,294**
ఇవ్వాల్సిన సిలిండర్లు : **2,10,882**
ఏడాదికి ఇవ్వాల్సిన సాయం రూ.**18.57** కోట్లు

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి (సూపర్ 6)



మొత్తం అర్హులు : **98,549**
నెలకు ఇవ్వాల్సిన సాయం : రూ. **29.57** కోట్లు

గ్యాస్ సిలిండర్లు తక్షణం ఇవ్వాలి



రోజురోజుకూ గ్యాస్ సిలిండర్ ధర పెంచుతున్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తే మాలాంటి పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే ఇంతవరకూ ఆ ఊసేలేదు. ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నాం. ఇలా జాప్యం చేయడం సబబు కాదు.

– ఎస్.రూప, అక్కిరెడ్డిపాలెం, అనకాపల్లి మండలం

హామీలు నెరవేర్చండి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ గ్యాస్ కొనుగోలు చేసుకోవలసి వస్తోంది.సత్వరమే ఉచిత గ్యాస్ అందివ్వడానికి చర్యలు తీసుకోవాలి.

– చిట్టూరి లక్ష్మి, నరసింగబిల్లి, కశింకోట మండలం.

బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి ?



కూటమి అధికారంలోకి వస్తే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్నిరోజులైనా దాని గురించి పట్టించుకోవడం లేదు. కేవలం 5,6 కిలో మీటర్లకు రూ.15 వరకూ ఆటోలకు చెల్లిస్తున్నాం. మాకు రోజుకు రూ.300 కూలీ వస్తే రూ.50 చార్జీలకే పోతోంది. త్వరగా ఉచిత బస్సు హామీ నెరవేర్చాలి

– ఇ.ఈశ్వరమ్మ, రేబాక, అనకాపల్లి మండలం

సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టారు



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి నాయకులు మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఊదరగొట్టారు. ఇప్పటి వరకు దీనిపై ప్రస్తావన లేదు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఉచిత ప్రయాణ సదుపాయం అమలుకు చర్యలు తీసుకోవాలి.

-కరణం భవానీ, జి.భీమవరం, కశింకోట మండలం.

ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు



మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఆ ఊసే లేదు. హామీ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలి.

- గంటా సుభాషిణి, నర్సింగరావుపేట, అనకాపల్లి

డేటా అంటూ దాటేశారు



నీకు 15 వేలు... నీకు 15 వేలు...నీకు 15 వేలు ఇలా ఇంట్లో చదువుకున్న పిల్లలు ఎంతమంది ఉంటే అంత మందికీ తల్లికి వందనం పథకం కింద ఏటా రూ.15 వేల ఇస్తామన్నారు. తీరా ఇప్పుడు డేటా అంటూ దాటేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అమ్మ ఒడి పథకం కింద మూడు దఫాలు నిధులు మంజూరు చేసి, చదువుకు చేదోడుగా నిలిచారు. కూటమి ప్రభుత్వం హామీ విస్మరిస్తుందని అనుకోలేదు.

– యల్లపు అరుణ, కశింకోట

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 20 ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపీఈపీడీసీఎల్ స్థానిక డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. దీనివల్ల తేగాడ, బయ్యవరం, కశింకోట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేజ్రీవాల్ నిర్ణయం అభినందనీయం

అనకాపల్లి: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేసి నిర్దోషిగా నిలబడిన తర్వాతే ముఖ్యమంత్రిగా పని చేస్తానని చెప్పడం అభినందనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు అన్నారు. తమ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నేతలంతా కేజ్రీవాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 291 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	4,400	5,100
రెండో రకం	3,500	4,220
మూడో రకం	3,000	3,350

పాల సేకరణ ధర.. జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న డెయిరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

అనకాపల్లి: విజయ విశాఖ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు గిట్టుబాటు ధర చెల్లించక, రైతుల నుంచి పాలు సేకరిస్తున్న డెయిరీ కార్యదర్శులు, ఉద్యోగులకు గత ఐదు సంవత్సరాలుగా వేతనాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డెయిరీ ఉద్యోగుల సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20న జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నామని, సమస్యలపై ఆరోజు చర్చిస్తామని ఆయన చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి కనకారావు, కరక సోమినాయుడు, దొడ్డి సూర్యారావు, కరెడ్ల దేవుడు, గల్లా ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినాయక పందిళ్ల వద్ద అన్నసమారాధనలు



పూడిమడక రోడ్డులో అన్నసమారాధన



జోనల్ కార్యాలయం వద్ద అన్నదానం

అనకాపల్లి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వినాయక పందిళ్ల వద్ద బుధవారం భారీ అన్నసమారాధనలు కమిటీ సభ్యులు నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారి పూడిమడక రోడ్డులో విశాఖ ముఠా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ దర్శించుకుని అన్నసమారాధనను ప్రారంభించారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది ఏర్పాటు చేసిన అన్నదానాన్ని జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

21న 100 కేజీల లడ్డూ ఏర్పాటు

• 30న 35 అడుగుల వినాయక నిమజ్జనోత్సవం



35 అడుగుల వినాయకుడు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి బస్టాప్ ఎదురుగా వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన 35 అడుగుల గణపతి విగ్రహం వద్ద ఈ నెల 21న 100 కేజీల భారీ లడ్డూ ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు కోరిబిల్లి ప్రశాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొదటి సారిగా 35 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి వస్తున్నారన్నారు. ఈ నెల 23న భారీ అన్నసమారాధన, 25న వినాయక లడ్డూ వేలం పాట జరుగుతుందని చెప్పారు. 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి వినాయక నిమజ్జనోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

తీర్పును పునఃసమీక్షించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కశింకోట : ఎస్సీల వర్గీకరణపై సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, ది వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ పూలే-అంబేడ్కర్ తదితర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి శ్రీనివాసరావు కార్యక్రమానికి నాయకత్వం వహించి మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగాలన్నారు. సమితి మండల అధ్యక్షుడు వంకర రాజు, కార్య నిర్వాహకులు వంకర వెంకటరావు, బోని గణేష్, దొమ్మెసి సత్యారావు, వేచలపు ప్రకాష్, కొత్తపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా పాఠ్యాంశాల బోధన



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

కశింకోట: పాఠశాలల్లో ప్రణాళికా బద్ధంగా పాఠ్యాంశాలు బోధించడానికి కృషి చేయాలని రిసోర్స్ పర్సన్లు ఎస్.సూర్యకుమారి, బోయిన చిన్నారావు సూచించారు. కశింకోట బాలికల హైస్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని స్కూళ్లలో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. రానున్న నెలలో విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యాంశాలను ఎలా బోధించాలనే విషయమై దిశనిర్దేశం చేశారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు



కశింకోట హైస్కూల్ మైదానంలో షటిల్ ప్రాక్టీస్ చేస్తున్న బాలికలు

కశింకోట: కశింకోటలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో విద్యార్థులు ఉత్సాహంగా ప్రాక్టీస్ చేసి సన్నద్ధమయ్యారు. స్థానిక బాలికల హైస్కూల్, డీపీఎన్ జెడ్పీ హైస్కూళ్లలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నుంచి సుమారు 600 మంది పాల్గొననున్నారు. గతంలో మండల, నియోజవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో ఆడి విజేతలుగా నిలిచిన వారితోపాటు ఉత్సాహవంతులైన వారు పోటీలో పాల్గొనడానికి సిద్ధమయ్యారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, యోగా, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయి. 11 ఏళ్లలోపు, 14 ఏళ్ల లోపు, 17 ఏళ్ల లోపు వారికి పోటీలు నిర్వహిస్తారు. విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపడానికి సంసిద్ధం చేస్తున్నారు. కశింకోట బాలికల పాఠశాలలో పీడీ పెంటకోట కమల ఆధ్వర్యంలో ఖోఖో, యోగా, షెటిల్, వాలీబాల్ తదితర పోటీల్లో విద్యార్థినులు ప్రాక్టీస్ చేశారు. డీపీఎన్ జెడ్పీ స్కూల్‌లో పీడీ వి.ప్రభాకరరావు పర్యవేక్షణలో, మిగిలిన పాఠశాలల్లోను ప్రాక్టీస్ చేశారు. పోటీల్లో ఎలాగైనా విజేతలుగా నిలవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఆశయంతో బాలబాలికలు సిద్ధమయ్యారు.

రచయిత పడాల వీరభద్రరావు మృతికి సంతాపం



వీరభద్రరావు(ఫైల్)

తుమ్మపాల: రచయిత, అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘ వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు అకాల మరణానికి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రగాఢ సంతాపం తెలిపింది. కోస్తా సమయం దినపత్రిక సంపాదకుడు, జిల్లా అభ్యుదయ రచయుతల సంఘం ఏర్పాటుకు ముఖ్య కారకులైన పడాల వీరభద్రరావు(73) మంగళవారం రాత్రి అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ వైద్యశాలలో మరణించడం బాధాకరమని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటని, ఎన్నో పోరాటాలు చేసి అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను ప్రజల్లో విస్తృత ప్రచారం చేశారని, అల్లూరి స్మారక మందిరం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు జి.ఎల్.ఎన్.శాస్త్రి , గౌరవాధ్యక్షులు గెల్లా జయబాబు తదితరులు సంతాపం తెలిపారు.

నేడు దుర్గమాంబ పుట్టుక మహోత్సవం

కశింకోట: కశింకోట గవరపేటలో ప్రసిద్ధి చెందిన దుర్గమాంబ పుట్టుక మహోత్సవం గురువారం సాయంత్రం జరపనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. అందంగా పూలతో అలంకరించిన పల్లకిపై సంప్రదాయ డప్పులతో అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి కనకమహాలక్ష్మి ఆలయం వెనుక ఉన్న అమ్మవారి పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాన్ని తీసుకొచ్చి పల్లకిలో ఉంచి ఊరేగిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీగా బాణసంచా ఏర్పాటు చేశామన్నారు.